# చైతన్య స్రవంతి

అనామకుడు

ఎవరైనా వస్తారో, రారో, మొదటి రోజే ఎవ్వరూ రాకపోతే - మొదటి రోజే కాదు తర్వాత ఒక్కరోజు కూడా ఒక్క పేషంట్ కూడా రాకపోతే - అసలు పేషంట్లే రాని డాక్టర్ ఎక్కడా ఉన్నట్లు లేదు. కానీ ఒకవేళ అలా అయితే -

సందుకో డాక్టరుంటున్నాడు. అయినా అందరు డాక్టర్ల దగ్గరా ఒకరో, ఇద్దరో పేషంట్లుంటూనే ఉన్నారు. ఒక్క పేషెంట్ కూడా రాకుండా ఉన్న డాక్టర్లు ఎవ్వరూ ఉండి ఉండరు -

పేషంట్ అంటే రోగి - రోగి అంటే రోగం - దేహం రోగభూయిష్టం అన్నాడు బుద్ధుడు - బుద్ధుడికి రోగం వచ్చినట్లు ఎక్కడా చదవలేదు - బుద్ధుడికి రోగం వచ్చినట్లు మెడిసిన్ పుస్తకాల్లో ఎక్కడా లేదు - మెడిసిన్ పుస్తకాల్లో కాక ఇంకే పుస్తకాల్లో నయినా రాసి ఉండవచ్చు తెలియదు - ఇంకా వేరే పుస్తకాలెక్కడ ?

అంత లావుపాటి పుస్తకాలు - అనాటమి - ఫిజియాలజీ - అవన్నీ చదివి, పరీక్షలు పాసవడమంటే - హెల్ - ఆ రోజులయి పోయాయి - వెయ్యేసి పేజీల పుస్తకాలు ?-

వెయ్యి పేజీల పుస్తకమే వేయిపడగలు - తిరగేస్తే అంతా పాముల మయం - పాతమయం - అయినా అదో అందం - మనిషి శరీరాన్ని అడ్డంగా కోస్తే, నిలువుగా కోస్తే, వేలు చివరకోస్తే - ఏముంటుందని చదివిన వాళ్ళకి ఇంకేం చదివినా బానే వుంటుంది-

లైబ్రరీల్లో గంటలు గడిచి పోయేవి - రాత్రిళ్ళు నిద్ర లేకుండా

నిద్ర నిన్న రాత్రి కూడా రాలేదు - కలత నిద్ర - పేషెంట్లు - క్లినిక్ నిండా - క్లినిక్ ముందు వీధిలో - వెయిటింగ్ చేస్తూ - రోగాలు - ప్రిస్క్రిప్షన్ లూ - ఫీజులూ - డబ్బూ - డబ్బూ -

డబ్బు సంపాదించడం వ్యసనం - అదో ఊబి - అందులోకి దిగితే, ఇంక గట్టెక్కడం లేదు - వేలు, లక్షలు సంపాదించడమే - కోట్లున్నాయి మావయ్యకి, అయినా ఆనర్సింగ్ హోంకి పేషెంట్లని రప్పించుకుని, డబ్బు గుంజు కుంటున్నారు - అందుకే - అందుకే - ఆ నర్సింగ్‌హోం ఇరుగ్గా ఉంటుంది - ఎంత విశాల మయిన బిల్డింగయినా అందులో ఉండడం ఇరుకే - స్వార్థం - సంకుచితత్వం అందుకే అక్కడ ఉండకూడదనే ఈ క్లినిక్ -

ఇంకా ఎవ్వరూ రావడం లేదు - టైం

తొమ్మిదిన్నరవుతోంద - అరగంట దాటుతోంది

తెరిచి క్లినిక్ తెరిచిన మొదటి రోజు డాక్టర్లకి పేషెంట్లు రావడమెలా - ఇది నేర్పలేదు ఆరేళ్ళ కోర్సులో - అసలక్కడ నేర్పిందంతా హంబగ్ - అంతా పుస్తకపరం - క్లినిక్ ఎలా పెట్టాలి, పేషెంట్ల నెలా సంపాదించాలన్నది నేర్ప రక్కడ -

పేషెంట్లు డాక్టర్లని వెతుక్కుంటూ రావాలి - నరత్న మన్విష్యతి మృగ్యతే హితత్ - కాళిదాసు - శాకుంతలం- ఇంటర్‌లో కాలేజీ డ్రామాలు - శకుంతల వేషం వేసిందెవరు? - రజని - తర్వాత సినిమా ఛాన్సులకి బొంబాయి వెళ్ళింది - అక్కడేమయింది - ఏ రెడ్‌లైట్ ఏరియా లోకెళ్ళిందో - బావుండేది -

బావుండడమంటే స్రవంతి కన్నా కాదు - స్రవంతి చాలా అందంగా ఉంటుంది - ఏం చేస్తూండి వుంటుందో - ఏదో నవల చదువు కుంటుండి ఉంటుంది - మావయ్య నర్సింగ్ హోం నుండి ఇంటికి వచ్చేసరికి స్నానం చేస్తుంది - తర్వాత భోజనం - నిద్ర - సాయంత్రం వరకూ ఎదురు చూస్తుంది - తప్పకుండా ఎదురు చూస్తుంది - వెళ్తే - వెళ్ళి క్లినిక్ తెరిచానని చెప్తే - మావయ్యకి చెప్పాలి - చెప్పాలంటే క్లినిక్‌కి పేషెంట్లు రావాలి - పేషెంట్లు రాకుండా క్లినిక్ తెరిచానంటే - ఏం కేసులు వచ్చాయని మావయ్య అడిగితే - నో - ఎవరైనా వచ్చాకనే - ఎవరన్నారావాలి -

టైం గడవడం లేదు - వాచిలో ముళ్ళు తిరుగుతున్నాయి. అయినా టైం గడుస్తున్నట్లు లేదు - అసలు గడవకూడదు - పేషెంట్లు రావాలి - ఒక్కరైనా రావాలి - ఒక్కరూ కూడా రాకపోతే - ఇంటికి ఎలా వెళ్ళడం - ఇంటికెళ్ళేసరికి అమ్మ భోజనం సిద్ధంగా

ఉంచుతుంది - భోంచేసి సాయంత్రం మళ్ళీ రావాలి - మళ్ళీ కూచోడం - మళ్ళీ ఎదురు చూడ్డం బాబోయ్ - ఇదింతే నేమో - ఎన్నాళ్ళో -

ఓ గంట కూడా గడవ లేదు - ఇలా కూర్చుని ఎదురు చూడ్డం కష్టంగా ఉంది - ఇంకా కొన్నాళ్ళుంటే - మైగాడ్ -

గాడ్ - దేవుడు - ఎక్కడున్నాడో - గుళ్ళల్లో - గుండెల్లో - ఇదేదో కవిత్వంలోకి దిగుతోంది -

కవిత్వం - స్రవంతి కవిత్వం రాస్తుంది - రాసింది చూపిస్తుంది - కానీ సత్యానికి దూరంగా ఉంటుంది - సత్యం సాధారణంగా సున్నితంగా ఉండదు - కలలు అందంగా బావుంటాయి - కలల్లాగే కవిత్వమూ బావుంటుంది - ఎందుకంటే సత్యం కాదు - దాన్నిండా కవి కోతలు కోస్తాడు - డాక్టర్లు కూడా కోతలు కోస్తారు - రైతూ కోతలు కోస్తాడు - లోకమంతా కోతలే - ఒక్కొక్కరూ ఒక్కో కోత -

మెడిసిన్‌లో కోతలు కొయ్యడం నేర్పరు - అందుకే స్రవంతి గుండెని - అందంగా - ఎవరికీ కనబడనంత సున్నితంగా - కోత కోస్తున్నారు -

అది స్రవంతి గుండె కోతే - ఎనిమిదేళ్ళ నుండి - నాన్న పోయినప్పట్నుండీ - మావయ్యకి అల్లుడిలా అనుకుని చదువు చెప్పించాడు - స్రవంతి మొగుడనుకునే ప్రేమించింది - నర్సింగ్ హోం ఒక్కటే అడ్డు - అందులో పనిచేసి, దాన్ని నిర్వహించాలంటాడు మావయ్య - ఆ నర్సింగ్ హోం - అదో హెల్.



ఆ హెల్‌తో పాటే స్రవంతి అనే అప్సరసని కూడా ఇస్తానన్నాడు - అప్సరస కావాలి కానీ హెల్ వద్దు - ఇస్తే రెండూ ఇస్తాడు - లేకపోతే ఏమీ ఇవ్వడు - ఆ మాట మావయ్య ఇంకా అనలేదు - అంటాడు -

నర్సింగ్ హోంలో పని చెయ్యకుండా, క్లినిక్ పెట్టినట్లు తెలిసిన మరుక్షణం - నర్సింగ్ హోం అక్కర్లేకపోతే స్రవంతీ లేదంటాడు -

స్రవంతి ఏం చేస్తుంది - ఏం చేస్తూండి ఉంటుంది - ఓ పుస్తకం చదవడం అయితే, ఇంకో పుస్తకం - తీరిగ్గా, హాయిగా, పక్కనున్న సి.డి.ప్లేయర్ నుండి సంగీతం వింటూ -

క్లినిక్ పెట్టినట్లు స్రవంతికి తెలియదు - తెలియదు కాబట్టే కవిత్వం, సంగీతం -

పక్క నుండి ఏదో కూత వినిపిస్తోంది - అదేదో సినిమా పాట లాగుంది - టేప్‌రికార్డరు పెట్టుకున్నట్లున్నారెవరో - ఎటు పక్క ఇంటిలో

క్లినిక్ అన్న ఇల్లు ఓ పాత మేడ - మేడలో రెండు పోర్షన్ల మధ్యలో నున్న గదిలో క్లినిక్ - మేడకటూ ఇటూ పాతకాలం పెంకుటిళ్ళు, చిన్న డాబాలూ - అందులో జనం డబ్బు ఉండడానికీ లేకపోవడానికీ మధ్య నున్న వాళ్ళలా ఉంటారు -

నిజానికి లోకమంతా మిధ్యే,

- అంతా శంకర వాదమే -

శంకర్ దయవల్లే దొరికింది ఈ పోర్షన్ క్లినిక్‌కి - మధ్య తరగతి వాళ్ళకి జబ్బులుంటాయి - జబ్బుల్ని డాక్టర్లకి చూపించుకోవాలన్న కోరికుంటుంది - తక్కిన పెద్ద కోర్కెల్ని తీర్చుకోవడానికి సరిపోయేంత ఉండకపోయినా, ఈ కోరిక తీర్చుకునేంత డబ్బుంటుందని చెప్పి, శంకర్ ఈ పోర్షన్‌ని ఇప్పించాడు, అడ్వాన్స్ లేకుండా - వెయ్యి రూపాయల అద్దెకి -

వెయ్యి అద్దె కట్టాలంటే, అంత కన్నా ఎక్కువ రావాలి నెలకి, అంతకన్న ఓ మూడు వేలు ఎక్కువ వస్తే చాలేమో - ఇద్దరు మనుషులకి - అంత కన్న ఎక్కువ తీసుకోకూడదు - ఎక్కువ తీసుకునేందుకయితే నర్సింగ్ హోంనే తీసుకుని ఉండవచ్చు మావయ్య దగ్గర్నుండి -

డబ్బున్న వాళ్ళ నుండి నెలకి సరిపోయేంత తీసుకోవడం - లేని వాళ్ళకి ఉచితంగా చేయడం - అలా చేస్తేనే మనసుకి శాంతి -

శాంతి ఎక్కడా లేనిదదే - హైదరాబాద్‌కి లేదు - శాంతి కోసం అడవులకి పోవాలనేవారు అంతకు ముందు - ఇప్పుడు అడవుల్లో అసలు శాంతి లేదు - అడవుల నిండా గొడవలే - హత్యలూ, ఎన్‌కౌంటర్లూ -

ఎన్‌కౌంటర్ - యూ హావ్ టు ఎన్‌కౌంటర్ లైఫ్ - అన్నాడు శంకర్ - మెడికల్ కాలేజీలో - చదువు తప్ప తెలియని తనం కాదు జీవితం - అవునా ? కాదా ?

అన్నీ డైలమాలే -

ఎవరన్నా వస్తారా ? రారా ? దటీజ్ థౌజండ్ డాలర్ క్వశ్చన్ - డాలరంటే - డాలరంటే ముప్పై అయిదు రూపాయలు - ఓ రెండు నెలల క్రితం ముప్పై ఒకటి - చిన్నప్పుడు స్కూల్లో చదువుతున్నపుడు డాలరుకి పన్నెండే రూపాయలనే వారు - ఇప్పుడు ముప్పై అయిదయింది - అంటే రూపాయికి విలువ తగ్గిందా ? డాలర్ విలువ పెరిగిందా -

అప్పుడెప్పుడో శేరు బియ్యం నాలుగు కాన్లు అని ఎవరైనా అంటే నవ్వుగా ఉండేది చిన్నప్పుడు - అప్పుడెప్పుడో కాదు ఆర్నెల్ల క్రితం కిలో కందిపప్పు పదికి తక్కువుండేది - ఈ రోజు నలభైకి పైనే ఉంది ఆర్నెల్లలో రూపాయి విలువ పడిపోలేదూ ?

రూపాయి విలువ ఇలానే పడితే నెలకి నాలుగు వేలు చాలవు - ఇంకొంత కావాలి ? ఎంత కావాల్సి వస్తుంది ? అంతా గందరగోళం, మేధ మేటిక్స్ గందరగోళం, మెడిసిన్ అంతకన్నా గందరగోళం -

అంతా అయోమయం - కొంత తెలుసుకుంటే, ఎంతో తెలియదని తెలుస్తుంది, అంత తెలియదని తెలిశాక, ఇంక అంతా ఎలానూ తెలుసుకోలేమనిపిస్తుంది - చివరికి తెలుసుకునేదేమీ ఉండదని తెలుస్తుందా - అదే ఋషులకి తెలిసింది -

నిజంగా ఋషులకేదైనా తెలిసిందో లేదో తెలియదు - ఎవ్వరికీ తెలియందొకటుంది - అదే దేవుడని బుకాయించారేమో - అది బుకాయింపైనా, నిజమైనా -

ఫిజిక్సంటే శాస్త్రీయ దృక్పధమంటూ మొదలెట్టిన సబ్జెక్ట్ శాస్త్రానికీ వేదాంతానికీ మధ్యలో మెటాఫిజిక్సయిపోయింది - అంతా అన్ సర్టెనిటీ -

ఎందులోనూ ఇలా జరిగి తీరుతుందని పెట్టలేదు సృష్టికర్త ఇలా అవుతుందని - ఇదే సత్యమని ఎవడన్నా అన్నాడా, అది కాదు ఇంకోటి నిజమనిపిస్తారు - కోపర్నికస్ నుండి - గెలీలియో నుండి న్యూటన్ నుండి ఐన్‌స్టీన్ నుండి - అలా - అంతే -

అంతెందుకు - మనిషికి కాన్సర్ ఎందుకొస్తుందో తెలీదు ఒక్కోసారి వచ్చింది ఏ జబ్బో తెలీదు - శరీరం. అంటే అయిదారు అడుగుల పొడవూ, అరవై కిలోలకి అటూ ఇటూ బరువున్న పదార్థం - దాని అంతు చూడలేకపోతున్నాడు - విశ్వానికి అంతు తెలుస్తుందా ? అంతా భ్రమ -

పేషెంట్లు వస్తారన్నది భ్రమా ? వాళ్ళ కోసం ఎదురు చూడ్డం దండగ - చూడకపోతే ఎలా - కొట్టు కట్టుకుని వెళ్ళిపోయాక, ఎవరన్నా వస్తే -

అసలు ఎవరికన్నా డాక్టర్ అవసరం రావాలి - వాళ్ళకి క్లినిక్ తెరిచినట్లు తెలియాలి - అప్పుడు వస్తారు - అంత వరకూ వెయిటింగ్ - ఒకరికి తెలిసి వారు తక్కిన వాళ్ళకి ఈ డాక్టర్ మంచి వాడని చెప్తే - ఇంక పేషెంట్లు వెయిటింగ్ -

ప్రస్తుతం డాక్టర్ వెయిటింగ్ ఫర్ పేషెంట్ - తర్వాత పేషెంట్ వెయిటింగ్ ఫర్ డాక్టర్ -

పేలపిండి కథే ఇది - ఇంకా మొదటి పేషెంట్ లేదు - అప్పుడే ఊహల్లోకి, కలల్లోకి - అందుకే కలలు బావుంటాయి -

బావుండడమంటే స్రవంతి ఆలోచనలే - అందంగా ఉంటుంది - అందంగా కనిపిస్తుంది - అందంగా మాట్లాడుతుంది - ఆ శరీరం స్పర్శ కూడా అందంగా ఉంటుంది -

మొగుడి నయ్యేవాడని, శరీరాన్ని తాకనిచ్చింది - అదో ఆనందం - సాయంత్రం డాబా మీద సూర్యాస్తమయం చూస్తూ కూర్చునేది - ఒక్కోసారి కళ్ళనీ, ఒక్కోసారి భుజాల్నీ, ఒక్కోసారి చెంపల్నీ - వేళ్ళ తోటో, పెదవులతోటో తాకనిచ్చేది - కొన్ని క్షణాలు - అంతే -

అదో అందమైన అనుభవం - ఆ అనుభవం కావాలన్న కోరిక - అంతకన్నా ఇంకేదో కావాలన్న కాంక్ష - వేడి - మంట - మంటలు రేగుతాయి స్రవంతి గుండె నిండా -

స్రవంతి లేని జీవితం కష్టం - అయితే స్రవంతి కోసం కూడా - ఆ నర్సింగ్‌హోంలో ఉండకూడదు - అది స్వార్థానికి పరాకాష్ఠ -

ఇంకొంత సేపటికి ప్రసవించబోయే తల్లి పేగులోని బాధను గుర్తించదు - ఆ నర్సింగ్‌హోం, ఆ తల్లి మెళ్ళోని మంగళ సూత్రాన్ని చేతికున్న ఉంగరాన్ని తప్ప -

జబ్బు లేకుండా, డబ్బు మాత్రం ఉన్న రోగికి - రెండు మూడు నెలలు మంచి ఆతిథ్యం ఇవ్వగలిగే నర్సింగ్‌హోం - డబ్బు లేకుండా జబ్బున్న రోగిని ఒక్క క్షణం కూడా భరించదు.

పాలిష్‌డ్ స్టోన్స్ - పెయింటెడ్ వాల్స్ - సీతాకోక చిలకల్లాంటి రిసెప్షనిస్టులు - ఇంగ్లీషు ధారాళంగా మాట్లాడే నర్సుతో ఓ గంట కన్నా ఎక్కువ సేపు నర్సింగ్ హోంలో గడపడానికి టైం లేని ఫారిన్ రిటర్న్డ్ (Returned) డాక్టర్లూ -

మావయ్యకి నెలకి లక్షల్లో డబ్బు సంపాదించేందుకుంది - అక్కడ ఒక్క క్షణం ఉండడం దుర్భరం -

దానికన్నా ఈ క్లినిక్ - వెయ్యి రెట్లు సుఖం -

మధ్యలో ఓ పార్టిషన్ - అటు పేషెంట్లుకీ ఇటు డాక్టర్‌కీ, మధ్యన అడ్డుగా - నిజానికి డాక్టర్ పేషెంట్ రిలేషన్ షిప్‌లో అడ్డులు లేవు - ఉండకూడదు -

బయట ఏదో అలికిడి అవుతోంది - ఎవరన్నా వస్తున్నారేమో - ఏమీ లేదు - అంతా భ్రమ - ఈ సందులో అసలు జనం నడుస్తున్నారో లేదో - ఒకసారి లేచి చూడాలి - లేచి వెళ్ళేసరికి ఎవరన్నా వస్తే - వస్తే మంచిదే - చూడాలి -

చాలా మందీ నడుస్తున్నారు - కూడా వెళ్తున్నారు - ఇలా చూస్తున్నారు కూడా - అయితే ఇలా ఆరోగ్యంగా తిరిగేవాళ్ళకి డాక్టర్ల అవసరం ఉండదు - వీళ్ళ ఇళ్ళలో ఎవరికన్నా బాగులేకపోతే -- వాళ్ళని తీసుకు వస్తారు - వస్తారు -

వాళ్ళకి క్లినిక్ బోర్డు బాగా కనిపిస్తోందో - లేదో - అన్నిటికీ ఖర్చు తగ్గించడంలో - క్వాలిటీలోనూ, సైజులోనూ చిన్నవయి పోయుంటాయి - బోర్డు ఎలా కనిపిస్తుందో - "డా॥ చైతన్య యం.బి.బి.ఎస్" - అక్షరాలు బాగా కనిపిస్తాయి - డాక్టర్ చైతన్య అన్న పేరుకోసం అమ్మ కలలు కంది - అమ్మ కలలు నిజమయ్యాయి -

పేషెంటు కోసం కలలు కూడా నిజమవుతాయి -

స్రవంతి కోసం కన్న కలలే - ఆ నర్సింగ్ హోంతో సంబంధం వల్ల, స్రవంతితో సంబంధం తెగిపోతుంది - అయ్య బాబోయ్ - తప్పదు -

గదిలో కూర్చోవడం తప్పదు - ఎంత సేపయినా చూసినవే చూడాలి - ఓ కుర్చీ, ఓ టేబుల్, చిన్న స్టూల్స్ రెండు, ఇది పార్టిషన్‌కి ఈ పక్క, రెండు పొడుగు బల్లలు పార్టిషన్‌కి ఆ పక్క - ·

ఖర్చు తక్కువైన క్లినిక్ - ఇది బీదలచే - బీదలకోసం తెరవబడ్డ - బీద క్లినిక్ -

డబ్బు కోసం, డబ్బున్న వాళ్ళు పెట్టిన ఖరీదైన నర్సింగ్ హోం - కాదు -

బీద క్లినిక్‌లో ఖరీదైన ఎక్విప్‌మెంటుండదు - పెద్ద సర్జరీలు జరగవు - ఇదో లోపం -

ఖరీదైన నర్సింగ్‌హోంలో మంచి ఎక్విప్‌మెంట్ ఉంటుంది - బీదోళ్ళకి ఉచితంగా చేసే ఆస్పత్రులు కావాలి - ఊరికే పేరుకిఉన్న ధర్మాసుపత్రులు కావు - నిజమైన ధర్మాసుపత్రులు - లోపాలు లేని ఆసుపత్రులు -

లోపాలు లేని ఆసుపత్రులు లేకపోవడం - పెద్ద లోపం -

లోపాలు లేనివి ఈ సృష్టిలో ఎక్కువ లేవు - ఎక్కడో ఓ స్రవంతి తప్ప -

స్రవంతి గురించి ఆలోచనలు మానెయ్యాలి - మావయ్య మర్చిపో మనేలోగా మర్చిపోవాలి -

మర్చి పోవాలి - చాలా మర్చిపోవాలి

ఎనిమిదేళ్ళ చదువు మావయ్య చెప్పించిందని మర్చిపోవాలి - అది మర్చి పోకపోతే - ఓ రకమైన బానిసత్వ భావం ముసిరి - ఆ నర్సింగ్ హోం జైలులో బలే అయిపోవాల్సి వస్తుంది -

కృతజ్ఞతా భావం పెద్ద గుదిబండ - అవతలి మనిషి తప్పుచెయ్యమన్నా చేసేంత కృతజ్ఞత కూడా మంచిది కాదు - కృతఘ్నుడు అనిపించుకోవడం - పేదలకు ఉచితంగా వైద్యం చెయ్యకపోవడం కన్న పెద్ద పాపం కాదు -

పాపం, పుణ్యం మాటలొదిలేసినా - సాటి మనిషికి చేతనైన సాయం చెయ్యక పోయినా - హాని చెయ్యని జీవితం కావాలంటే ఈ క్లినిక్ ఉండాలి - అంటే పేషెంట్లు రావాలి -

ఆలోచనలన్నీ పేషెంట్ల దగ్గరే ఆగుతున్నాయి - పేషెంట్ల కోసం ఎదురు చూడ్డం దగ్గర కొచ్చేస్తున్నాయి -

ఎదురు చూడ్డం - సాయంత్రం అయ్యేసరికి - స్రవంతి ఎదురు చూస్తుంది, చైతన్య కోసం - చైతన్య క్లినిక్‌లో కూర్చుని పేషెంట్ల కోసం ఎదురుచూస్తుంటాడు -

కొత్తగా క్లినిక్ పెట్టిన డాక్టర్లందరూ ఇలాగే ఉంటారేమో - ఎదురు చూస్తూ - భయపడుతూ -

క్లినిక్‌లు కాకుండా - తక్కిన కొట్లు ప్రారంభించిన వాళ్ళందరూ ఇలానే కూర్చుని ఉంటారేమో నగల కొట్ల వాళ్ళు, బట్టల కొట్ల వాళ్ళు, ప్రొవిజన్ స్టోర్స్ వాళ్ళూ, బ్యూటీ పార్లర్ల వాళ్ళూ, మంగలి కొట్ల వాళ్ళూ -

ఛ - డాక్టర్ క్లినిక్‌కీ మంగలి కొట్టుకీ సంబంధం ఏముంటుంది - ఉంటుంది ఇద్దరూ కత్తులు వాడతారు - ఇద్దరూ 'పని' చేశాక డబ్బులు పుచ్చుకుంటారు - ఇద్దరూ అవతలి వాళ్ళ అవసరాన్ని బట్టే బతుకుతారు -

నగలమ్ముకునే వాళ్ళతో పోల్చుకుందుకు లేని నామోషీ, మంగలి కొట్ల వాళ్ళతో పోల్చుకుంటే వచ్చేస్తోంది -

నిజానికి దీన్ని మంగలి కొట్టుతోనేకాదు - ప్రాస్టిట్యూట్ షాప్‌తో కూడా పోల్చచ్చు - అక్కడ ప్రాస్టిట్యూట్స్ ఎవరన్నా వస్తారా అని ఎదురు చూస్తుంటారు - ఇక్కడా అంతే - కొంత డాషింగ్‌గా ఉన్న ప్రాస్టిట్యూట్స్ రోడ్ల మధ్యలో నిలబడి కష్టమర్స్‌ని పట్టుకుంటారు - కొంత డేరింగ్ ఉన్న డాక్టర్స్ ధర్మాసుపత్రుల దగ్గర నిలబడి కస్టమర్సుని పట్టుకుంటారు - డబ్బున్న ప్రాస్టిట్యూట్స్ దగ్గరకి జనం విరగబడి వెళ్తారు - అలానే ఖరీదయిన నర్సింగ్‌హోంలున్న డాక్టర్ల దగ్గరికీనూ -

ప్రాస్టిట్యూట్స్ అయినా, డాక్టర్సయినా ఒకటే - అవతలి వాళ్ళకి కావలసింది ఇచ్చి, డబ్బు తీసుకుంటారు - ఇదీ వ్యాపారం అంటే -

వ్యాపారం అంటే పప్పు, ఉప్పు అమ్ముకోవడమే కాదు - అది ఒకప్పటి విషయం - ఇప్పుడు అన్నీ అమ్ముకోవడమే - వైద్యం అమ్ముకుంటారు, విద్యని అమ్ముకుంటారు - వైద్యవిద్యని అమ్ముకుంటారు -

వైద్యశాలలో డిగ్రీలని కొనుక్కోవచ్చు - డబ్బుంటే కాలేజీలో సీటొస్తుంది - తర్వాత డిగ్రీలని కొనుక్కోవచ్చు - డబ్బుంటే - కాలేజీలో చదువుకొంటారు - డబ్బున్న వాళ్ళు డిగ్రీ కొంటారు - డిగ్రీ అయ్యాక అందరూ ఒక్కటే -

ఆరేళ్ళ జీవితంలో చదువుకోసం, డిగ్రీ కోసం ఖర్చు పెట్టిందానిని వడ్డీతో సహా సంపాదించుకునేందుకు చూస్తారు ఇంత సంపాదన అని లేదు - సంపాదించడమే - అదో ఊబి -

ఆ ఊబిలోకి దిగకూడదు - రోగి అవసరానికి వైద్యం చెయ్యాలి- డబ్బు కోసం కాదు -

అక్కర్లేని ఇంజెక్షన్లు పొడిచేసి డబ్బు తీసుకోవడం - అనవసరమైనా దగ్గరున్న మందులు ఇచ్చి, ఫీజులు పెంచడం - ఖరీదైన మందుల్ని తెలిసున్న మందుల షాపుల్లో కొనిపించి కమీషన్ తీసుకోవడం ఊరికే రకరకాల టెస్టులకి లేబరేటరీలకి పంపించి, వాటా కొట్టెయ్యడం - చిన్న రోగాలకి కూడా స్పెషలిస్టుల దగ్గరకి పంపి పర్సెంటేజీ అడగడం ఇవన్నీ చెయ్యకూడదు -

ఇవన్నీ చెయ్యాలనుకుంటే, ఇక్కడ ఈ క్లినిక్‌లో కూర్చోడం దండగ - మామయ్య నర్సింగ్‌హోంలో చేరిపోతే సరి -

అక్కడ చేరకూడదు - ఇక్కడ అన్యాయపు ప్రాక్టీస్ చెయ్యకూడదు - నెలకి కావాల్సినంత సంపాదన వస్తే చాలు - సంపాదన రావాలంటే -

పేషెంట్లు రావాలి - పేషెంట్లు - లాభం లేదు - ఇలా ఎవ్వరూ కనిపించకుండా కూర్చుంటే ఇలాంటి ఆలోచనలే వస్తాయి - కుర్చీ కొంచెం అటు వేసుకుంటే - పార్టిషన్‌కి అటు పక్క రోడ్డు కనిపిస్తుంది - ఎవరన్నా వస్తున్నట్లు కనిపిస్తే ఇటు మార్చచ్చు - అటు కూర్చుని వీధిలోకి చూస్తుంటే కొంత కాలక్షేపం అవుతుంది -

పరవాలేదు - బాగా సందడయిన వీధి - జనం బాగా తిరుగుతూనే ఉన్నారు - వాళ్ళిద్దరూ ఇటే చూసుకుంటూ వెళ్తున్నారు - భార్యా భర్తలే అయ్యుంటారు - ఆయన చేతిలో సరుకుల సంచీ - ఆవిడ చేతిలో మనీబాగ్ -

భారం మోసేవాడు భర్త - అతను భర్తే - చైతన్య భర్త - స్రవంతి భార్య - ఛ స్రవంతితో పెళ్ళయితే భారం అంతా స్రవంతికే అప్పగించెయ్యచ్చు - సంసారాన్ని భరించడం స్రవంతికే తెలుసు - ఎంత సుఖం - భారమంతా ఇంకొకరికిచ్చేసి బతకడం ఎంత సుఖం - మరి భర్తలంతా భరిస్తుంటే, భార్యలెందుకు స్వతంత్రం లేదని బాధపడి పోతున్నారో, అదంతా ఫెమినిజం - స్రవంతికి ఆ ఆలోచనలే లేవు -

భార్యా భర్తలంటే ఫ్రెండ్స్ అంటుంది స్రవంతి -

స్రవంతి ఇంక భార్య అవదు - అవుతుంది - ఎవరికో అవుతుంది - ఎవరికవుతుందో - ఎవడో బిజినెస్ మాన్ కిస్తాడేమో మావయ్య - వాడెలా గుంటాడో - స్రవంతికి ఇష్టముంటుందో ఉండదో - ఉండకపోయినా ఏం చేస్తుంది - వాణ్ణే భరిస్తుంది -

ప్రాస్టిట్యూట్ కష్టమర్‌ని భరిస్తుంది - డాక్టర్ పేషెంట్‌ని భరిస్తాడు -

అందరు డాక్టర్లూ అలాకాదు - వృత్తి అంటే ఇష్టం ఉన్న వాళ్ళు ఉంటారు. అవతలి మనిషికి సాయం చెయ్యాలనుకున్నవాళ్ళూ ఉంటారు - తమ చదువుని సద్వినియోగం చేద్దామనుకున్న వాళ్ళు ఉంటారు -

ప్రాస్టిట్యూట్స్‌లోనూ అంతే - మగాళ్ళ అవసరాల్ని తీర్చాలని అనుకున్న వాళ్ళు

ఉంటారు - తమ శరీరాల్ని - తుచ్ఛమైన శరీరాల్ని - హేయమైన శరీరాల్ని - అశాశ్వతమైన రక్త మాంసాలతో కూడుకున్న శరీరాల్ని - అవతలి వాళ్ళ కోరిక తీర్చేందుకు అర్పిస్తున్నారు -

ఇలా ఆలోచిస్తే ప్రొఫెషన్స్ అన్నీ మంచికే -

అవతలి మనిషికి హాని చెయ్యని ప్రొఫెషన్స్ అన్నీ మంచివే -

అరె - వాడెవడో కుంటుకుంటూ నడుస్తున్నాడు - కాలికి దెబ్బ తగిలిందేమో - ఇటు వస్తాడా - వెళ్ళిపోతున్నాడు - దెబ్బ తగిలి చాలా కాలమయ్యుంటుంది - ఇంకో డాక్టర్‌కి చూపించుకుని ఉంటాడు ఆ డాక్టరెవడో అదృష్టవంతుడు -

అప్పుడే జెలసీ - ఛ - అసూయపడ కూడదు - అసూయ ఉండని వాళ్ళెవ్వరు - పేరులో అనసూయకి అసూయలేదు- తక్కిన అందరికీ ఉంటుంది - అదే లేకపోతే ఏదో చెయ్యాలన్న కోరిక ఉండదు -

స్రవంతినెవరైనా పెళ్ళి చేసుకుంటే - మైగాడ్ -

ఆవిడెవరో నడవలేక నడవలేక నడుస్తోంది - ఎన్నేళ్ళుంటాయి. అరవై, డెబ్భై, ఎనభై - వయస్సు కఠినంగా ఉంది - ఈవిడకి డాక్టర్ అవసరమా - అనవసరం - ఓ వయస్సు దాటాక శరీరంలో బాధలు తప్పవు - వాటికి వైద్యం లేదు - అనవసరం -

అయినా వైద్యం చేస్తూనే ఉంటారు - డబ్బు కోసమేకాదు - ఏ డాక్టరూ నీకింక వైద్యం చెయ్యనని ఎవరితోనూ అనలేడు - అంతే -

తప్పకుండా పోతాడని తెలిసిన కేసుల్లో కూడా కొంత ప్రయత్నం జరుగుతుంది - ఎక్కడో కానీ డాక్టర్ పేషెంట్ సుఖం కోరి ప్రాణాలు తీసేశాడని వినబడదు - అది హత్యవుతుందో, అవదో -

భలేగా ఉంది కారు - తెల్లగా, పొడుగ్గా, అందంగా నిగనిగలాడుతూ, కూలింగ్ గ్లాసెస్‌తో - లోపలున్న దెవరో - ఎవరో ధనవంతుడు - బిజినెస్ చేస్తూండి ఉండాలి - అన్నీ బిజినెస్‌లే - నిజమైన బిజినెస్ చేసే వాడయ్యుండాలి -

వాడో,- అదో - వాళ్ళకి రోగం వస్తే - వస్తే డాక్టర్లు నర్సులు వాళ్ళింటికి వెళ్తారు - వైద్యం చేస్తారు - ప్రాణం కాపాడతారు - వందేళ్ళకి పైన కాపాడుతారా ?

జరామరణాలు తప్పవన్నారు - మరి ఈ వైద్యం ఎందుకు ? వైద్యం మరణాన్ని ఆపేందుకు కాదు - రోగికి కష్టాన్ని తగ్గించేందుకు - ఏ వైద్యమూ మనిషిని మరణం నుండి ఆపలేదు -

వైద్యం కొందరి ప్రాణాల్ని కొంత కాలం నిలుపుతుంది - ఒక్క మనిషికి ఒక్కో సమయంలో సాయం చేస్తుంది - సమాజంలో రోగాల్ని, మరణాల్ని ఆపలేదు వైద్యం - సమాజ పరంగా చూస్తే వైద్యం వల్ల పెద్ద లాభం లేదు -

సమాజానికి లాభం దేనివల్లా లేదు - ఒక్క శాంతి వల్ల తప్ప - ఒకరికొకరు సాయం చేసుకునే మనస్తత్వం ప్రజల్లో అలవడితే తప్ప - అలా జరగాలంటే - అందరి మనస్సులూ ప్రశాంతంగా ఉండాలి. అంతర్గతమైన శాంతి ఉండాలి - మనశ్శాంతి -

మనశ్శాంతి కలగాలంటే విపరీతమైన స్వార్థపుటాలోచనలు ఉండకూడదు - తక్కిన మనుషులకి హాని చెయ్యకుండా - మంచి చేసేందుకు ప్రయత్నించాలి - అలా చేస్తే సమాజంలో శాంతి వస్తుంది - అలా శాంతిగా ఉన్న సమాజంలో మనశ్శాంతి ఉంటుంది - ఎందులోంచి ఏది వస్తుందో -

సమాజం శాంతిని సాధించేందుకు మనశ్శాంతి ఉండాలి - దాన్ని సాధించాలి -

స్వార్థం మోసం, దగా పేరుకు పోతున్నాయి - అందులో ఇరుక్కుపోకుండా - డబ్బుకోసమే ఉన్న ఖరీదైన నర్సింగ్‌హోంలో ఇరుక్కుపోకుండా - సామాన్యుల కోసం ధనంలేని వాళ్ళకోసం - తెరిచిన క్లినిక్‌లో కూర్చుని, సాయం చేస్తే మనశ్శాంతి వస్తుంది - వస్తుంది -

పేషెంట్ తప్ప తక్కిన వన్నీ వచ్చేట్లున్నాయి - ఆకలివేస్తోంది - ఇంటికెళ్ళి భోంచెయ్యాలి - టైం పన్నెండవుతోంది - క్లినిక్ పొద్దున్నకి మూసేసమయం

మూసెయ్యాలి, కుర్చీ అటుకేసి మూసెయ్యాలి -

ఎవరో వస్తున్నట్లుంది - అవును - ఎవరో వస్తున్నారు - ఎవరయి ఉంటారు మొదటి పేషెంట్ ఎవరయి ఉంటారు -

చొరవగా లోపలకి వచ్చేస్తూ -

క్లినిక్ పెట్టినట్లు తనకి చెప్పనందుకు నొచ్చుకుంటూ -

క్లినిక్ పెట్టినందుకు సంతోషంగా కంగ్రాట్స్ చెప్తూ

వంకాయ కూర చేశాను భోజనానికి రమ్మని ఆహ్వానిస్తూ ఇలా పెట్టినందుకు మావయ్య ఏమీ అనడనీ, అన్నా పట్టించుకోననీ ధైర్యం చెప్తూ -

కూర తరుగుతుండగా వేలికి చిన్న గాయం అయిందని, తెల్లగా, సన్నగా, పొడుగ్గా, నున్నగా ఉన్న చూపుడు వేలిని చూపిస్తూ -

తగ్గిపోతుందని అంటే - 'థాంక్స్' అంటూ తొలి ఫీజుగా పాతిక రూపాయలు అందిస్తూ -

– స్రవంతి .

